

పాఠశాల విలీనం వద్దే వద్దు

దిగువగిరిగదొనలోని పాఠశాలను విలీనం చేయవద్దని గ్రామస్తులు మంగళ వారం ఆందోళన వ్యక్తం చేశారు. - 8లో



అక్రమ క్వారీ.. కాసుల సవారీ!

పెద్దిశెట్టిపల్లె సమీపంలోని గుట్టలో కూటమి నేతలు అక్రమ క్వారీ తవ్వకాలు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. - 8లో



మీకు దిక్కున్న చోట చెప్పుకోండి?

గ్రామకంఠం భూమిని కూటమి నేత ఆక్రమించాడని రామానాయుడు పల్లి గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. - 8లో

న్యూస్‌రీల్

పన్ను వసూళ్లలో రాష్ట్రంలో రెండో స్థానం



సుధాకర్‌రావు, డీపీఓ

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లాలో పన్ను వసూళ్ల నందు రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచిందని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) సుధాకర్ రావు తెలిపారు. గత బకాయిలతో కలిపి మొత్తం వార్షిక లక్ష్యం రూ.24.45 కోట్లు కాగా అందులో రూ.21.34 కోట్లు వసూళ్లు అయ్యాయన్నారు. ఇందులో పన్నుల లక్ష్యం రూ.17.41 కోట్లకుగాను రూ.14.85, పన్నేతరులు రూ.6.84 కోట్లకుగాను రూ.6.49 కోట్లు వచ్చిందన్నారు. మొత్తం లక్ష్యంలో 87 శాతం చేరుకున్నామన్నారు. పన్నుల లక్ష్యంలో పశ్చిమ గోదావరి జిల్లా 88 శాతం వసూళ్లతో మొదటి స్థానం కాగా చిత్తూరు జిల్లా 85 శాతంతో రెండో స్థానం వచ్చిందన్నారు. పన్నేతరులు లక్ష్యం మన జిల్లా 95 శాతం వసూళ్లు సాధించి మొదటి స్థానం రాగా విశాఖపట్నం 94 శాతం రెండో స్థానంలో నిలిచిందన్నారు. కాగా నవంబరు నుంచి ఉత్తమ ఫలితాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఇందుకు సహకరించిన కార్యదర్శులకు అభినందనలు తెలిపారు. క్షేత్ర స్థాయిలో అందరూ కలిసి పనిచేయడం వల్ల మంచి ఫలితాలు వచ్చాయని వివరించారు.

3న ఇంటర్ మూల్యాంకనం పూర్తి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పరీక్షల మూల్యాంకనం ప్రక్రియ ఈనెల 3వ తేదీతో ముగియనుంది. ఈ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఇంటర్మీడియట్ డీవీఈఓ సయ్యద్ మౌలా వెల్లడించారు. ఈనెల 1వ తేదీ నాటికి 80 శాతం జవాబు పత్రాలను మూల్యాంకనం చేయడం జరిగిందన్నారు. మిగిలిన 20 శాతం జవాబు పత్రాలను ఈనెల 2, 3 తేదీల్లో పూర్తి చేస్తామన్నారు. దీంతో మూల్యాంకన ప్రక్రియ ముగుస్తుందని ఆయన తెలిపారు.


ఇన్‌చార్జిగా జేసీ విద్యాధరి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ విద్యాధరికి బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసింది. నూతన పాలక వర్గం గ్రంథాలయం సంస్థకు ఏర్పాటయ్యే వరకు జేసీ పర్సన్ ఇన్‌చార్జిగా ఉంటారని ఆదేశించారు.

గిరింపేటలో రేషన్ పట్టివేత

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : చిత్తూరు నగరం గిరింపేటలోని రేషన్ షాపునకు ఎదుట ఉన్న ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు పట్టుకున్నారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు ఆ షాపుపై దాడులు నిర్వహించారు. నిఘా పెట్టి ఆ ఇంట్లో తనిఖీలు చేయగా అక్రమంగా నిల్వ ఉంచిన 120 కిలోల బియ్యం పట్టుకున్నారు. దీంతో అక్రమార్కులపై 6ఏ కేసు నమోదు చేసినట్లు డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు.

నేటి నుంచే స్లాట్ రిజిస్ట్రేషన్లు



సబ్ రిజిస్ట్రార్, డాక్యుమెంటర్ రైటర్లకు అవగాహన కల్పిస్తున్న జిల్లా రిజిస్ట్రార్

చిత్తూరు కార్పొరేషన్ : ఆస్తి లావాదేవీల రిజిస్ట్రేషన్లకు ఇక స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేయనున్నారు. నిర్దేశించిన సమయంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. జిల్లాలోని ఆర్‌ఓ (జిల్లా కేంద్రంలోని అర్బన్ సబ్ రిజిస్ట్రార్) కార్యాలయంలో బుధవారం నుంచి ఈ ప్రకియ ప్రారంభించనున్నారు. నెలాఖరు లేదా మే నెల నాటికి దశల వారీగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. దీనిపై జిల్లా రిజిస్ట్రార్ రమణమూర్తి మంగళవారం సబ్‌రిజిస్ట్రార్, డాక్యుమెంట్ రైటర్లతో సమావేశమై పలు అంశాల గురించి వారికి అవగాహన కల్పించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 17 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్ : మద్యం తాగి వాహనాలు నడిపిన 17 మందికి రూ.1.70 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి మంగళవారం తీర్పు ఇచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు రెండు రోజులుగా వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం 17 మందిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.1.70 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

మందు బాబులు మద్యం తాగుతుంటే.. కూటమి నేతలు వారి రక్తం పీల్చేస్తున్నారు. వైన్‌షాపు యజమానులను గుప్పిట్లో పెట్టుకుని యథేచ్ఛగా దందా సాగిస్తున్నారు. ప్రధానంగా షాడో ఎమ్మెల్యేలుగా మారిన కొందరు ఘనులు మొత్తం వ్యవహారం నడిపిస్తున్నారు. కమీషన్ల కోసం డిమాండ్ లేని బ్రాండ్లను వైన్‌షాపు నిర్వాహకులకు అంటగడుతున్నారు. ఈ క్రమంలోనే తాము చెప్పిన వారికే పర్మిట్ రూమ్ ఇవ్వాలని హుకుం జారీ చేస్తున్నారు. అందులో రెట్టింపు ధరలకు తినుబండారాలు విక్రయిస్తూ మద్యపాన ప్రియుల జేబులను ఖాళీ చేసేస్తున్నారు. అలాగే కాసుల కక్కుర్తితో విచ్చలవిడిగా బెల్టు దుకాణాలు ఏర్పాటు చేయిస్తున్నారు. నాసిరకం బ్రాండ్లను అధిక రేట్లకు అమ్ముకుంటూ రూ.కోట్లు పోగేసుకుంటున్నారు. మామూళ్ల మత్తులో అధికారులను జోకొట్టి ఇష్టారాజ్యంగా అక్రమార్జనకు తెగబడుతున్నారు.



షాడోలకే కిక్!

కూటమి నేతల గుప్పిట్లో వైన్‌షాపు యజమానులు

- డిమాండ్ లేని బ్రాండ్లను అంటగట్టి.. అమ్మాలని ఒత్తిడి
- పర్మిట్ రూములే ఆదాయ వనరుగా దందా
- మందుబాబులకు చుక్కలు చూపిస్తున్న పచ్చమూక
- బెల్టు దుకాణాలతో నిలువు దోపిడీ

తిరుపతి జిల్లా సమాచారం

మొత్తం మద్యం దుకాణాలు	247
పర్మిట్ రూమ్‌లు	680
బెల్టు షాపులు	సుమారు 2 వేలు

చిత్తూరు జిల్లా సమాచారం

మొత్తం మద్యం దుకాణాలు	111
పర్మిట్ రూమ్‌లు	350
బెల్టు షాపులు	900లకు పైనే

సాక్షి ప్రతినిధి, తిరుపతి : మద్యం దుకాణాలను కూటమి నేతలు తమ అక్రమార్జనకు అడ్డాగా మార్చేసుకున్నారు. రూ.లక్షలు వెచ్చించి వైన్‌షాపు దక్కించుకున్న వారి కంటే పచ్చమూక ఆదాయమే అధికంగా ఉన్నట్లు పలువురు వ్యాపారులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ప్రభుత్వాన్ని నమ్మి మోసపోయామని వైన్‌షాపుల యజమానులు లబోదిబో మంటుంటే.. సందట్లో సడేమియా అంటూ కూటమి ఎమ్మెల్యేల పేరు చెప్పి కొందరు షాడోలు జేబులు నింపుకుంటున్నారు. ఇందుకోసం ప్రధానంగా పర్మిట్ రూమ్‌లనే తమ అక్రమ సంపాదనకు కేంద్రాలుగా తయారు చేసుకున్నారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో మద్యం దుకాణాల కంటే.. అనధికారిక పర్మిట్ రూములు, బెల్టు దుకాణాలనే అధికంగా ఏర్పాటు చేసుకున్నారు. వాటి ద్వారా విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. అధికమొత్తంలో వెచ్చించి దక్కించుకున్న దుకాణాల నుంచి కూటమి నేతలు ఎవరికి వారు రకరకాల రూపంలో మామూళ్లు వసూలు చేసుకుంటున్నారు.

అట్టపెట్టెలను కూడా వదలరా..?

ప్రతి దుకాణానికి మద్యం సీసాలను అట్టపెట్టెల్లో సరఫరా చేస్తుంటారు. ఆ అట్టపెట్టెలను మద్యం వ్యాపారులు రూ.11, రూ.12 చొప్పున విక్రయిస్తుంటారు. అయితే చిత్తూరులో మాత్రం షాడో ఎమ్మెల్యే ఆ అట్టపెట్టెలను సైతం తనకే అమ్మాలని, అదీ కేవలం రూ.8 చొప్పునే చెల్లిస్తామని స్పష్టం చేసినట్లు తెలిసింది.

ప్రతి నెలా..ఆదాయం ఇలా

జిల్లా పేరు	మద్యం విక్రయాలు	పర్మిట్ రూముల్లో విక్రయాలు	ఆదాయం
తిరుపతి	రూ.340 కోట్లు	రూ.20 కోట్లు	రూ.52 కోట్లు
చిత్తూరు	రూ.116 కోట్లు	రూ.10కోట్లు	రూ.18 కోట్లు

చిత్తూరులో ఆయనదే పెత్తనం

చిత్తూరు నియోజక వర్గ పరిధిలో మొత్తం 18 మద్యం దుకాణాలు ఉన్నాయి. నిబంధనల మేరకు విక్రయిస్తే పెట్టిన పెట్టుబడి రాదని భావించి వ్యాపారులు పర్మిట్ రూములు, బెల్టు దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. అయితే వాటన్నింటిపై చిత్తూరు షాడో ఎమ్మెల్యే దృష్టి సారించారు. మద్యం వ్యాపారులందరూ తాను చెప్పినట్లే నడుచుకోవాలను హుకుం జారీ చేశారు. అన్ని దుకాణాలు తన కనుసన్నల్లోనే నడవాలని ఆదేశించారు. అందులో భాగంగా పర్మిట్ రూములు, బెల్టు షాపులు తాను చెప్పిన వారికే ఇవ్వాలని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి సైతం వ్యాపారులకు ఫోన్లు వెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం.

మేం చెప్పిందే అమ్మాలి!

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని నియోజక వర్గాల్లోని మద్యం దుకాణాలపై కూటమి నేతల పెత్తనం తారస్థాయికి చేరినట్లు తెలిసింది. డిమాండ్ ఉన్న మద్యాన్నే ఎక్కువ మంది మద్యం ప్రియులు కొనుగోలు చేస్తుంటారు. చిత్తూరు నగరం లాంటి చోట పెద్దగా అమ్ముడుపోని మద్యాన్ని ఎక్కువగా విక్రయించాలని షాడో ఎమ్మెల్యే ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మేరకు తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. మద్యం డీలర్ల నుంచి కొందరు కూటమి నేతలు మామూళ్లు పుచ్చుకుని మద్యం ప్రియులపై నాసిరకం బ్రాండ్లను రుద్దుతున్నారని ప్రచారం జరుగుతోంది. చిత్తూరులో లభించే అనామక బ్రాండ్లే ఇందుకు నిదర్శనమని పలువురు విమర్శిస్తున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బెల్టు దుకాణాల్లో అయితే డిమాండ్ లేని మద్యం మాత్రమే అందుబాటులో ఉండేలా సదరు షాడో ఎమ్మెల్యే పక్కాగా ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

కుప్పం మున్సిపాలిటీకి డెప్యుటేషన్ల బదిలీలు

పుత్తూరు : ముఖ్యమంత్రి చంద్రబాబు తన సొంత నియోజకవర్గమైన కుప్పం మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకోవడానికి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అన్ని మున్సిపాలిటీల నుంచి పలువురు సెక్రటరీలను మూకుమ్మడిగా డెప్యుటేషన్లపై బదిలీ చేశారు. దీంతో జిల్లా నలుమూలల నుంచి విధిలేక విధులు నిర్వహించడానికి వందల కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని సెక్రటరీలు వాపోతున్నారు. పుత్తూరు మున్సిపాలిటీలోని ఎన్జీఓ కాలనీకి సచివాలయానికి చెందిన శానిటేషన్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీ మునస్వామి, సత్యనారాయణ కాలనీ సచివాలయ అడ్మిన్ సెక్రటరీ చాంద్‌బాషా, కళ్యాణపురం సచివాలయానికి చెందిన ఎడ్యుకేషన్ సెక్రటరీ రిజ్వాన్‌బాషా, టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందిన వార్డ్ ప్లానింగ్ సెక్రటరీలు మనోజ్, వినోద్‌కుమార్‌ను కుప్పానికి డెప్యుటేషన్‌పై బదిలీ అయ్యారు. ఈ మేరకు అనంతపురం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు అందాయి.

డీసీహెచ్‌ఎస్‌గా పద్మాంజలిదేవి



చిత్తూరు రూరల్(కాణిపాకం) : చిత్తూరు డీసీహెచ్‌ఎస్‌గా పద్మాంజలిదేవిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పుంగనూరు ఏరియా ఆస్పత్రిలో సివిల్ సర్జన్‌గా పనిచేస్తున్న ఈమె ఉద్యోగోన్నతి వరించింది. ఈ మేరకు ప్రభుత్వం పద్మాంజలిని డీసీహెచ్‌ఎస్‌గా నియమించింది. త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు. కాగా ఇక్కడ ఇన్‌చార్జ్ డీసీహెచ్‌ఎస్‌గా నగరి ఏరియా ఆస్పత్రి సూపరిటెండెంట్ ప్రభావతి బాధ్యతలు నిర్వర్తిస్తున్న విషయం విధితమే.

టీచర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- నేటి నిరసనకు తరలిరండి



మాట్లాడుతున్న ఫ్యాప్టో సంఘం చైర్మన్ మణిగండన్

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్ల డిమాండ్ల పరిష్కారం కోసం బుధవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించే నిరసన కార్యక్రమానికి పలు సంఘాల నాయ కులు తరలిరావాలని ఫ్యాప్టో (ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య) చైర్మన్ మణిగండన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఫ్యాప్టో సంఘం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు టీచర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి టీడీపీ విఫలమైందన్నారు. 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయకపోవడం అన్యాయమన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 9 నెలలు పూర్తి అవుతున్నా హామీలను నెరవేర్చకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. సెక్రటరీ జనరల్ మునీర్ అహ్మద్ మాట్లాడుతూ.. మెమో నంబర్ 57 ప్రకారం 2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ పునరుద్ధరణ చేయాలన్నారు. జీవో 117 ను రద్దు చేసి డీఎస్సీలో టీచర్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. అనంతరం ఆకస్మికంగా మృతి చెందిన చిత్తూరు డీవైఈవో చంద్రశేఖర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. సమావేశంలో ఫ్యాప్టో సంఘ నాయకులు చెంగల్ రాయమందడి, గంటామోహన్, జీవీ రమణ, మదన్‌మోహన్‌రెడ్డి, ముక్తార్ అహ్మద్, ఎస్పీ భాషా, దామోదరం పాల్గొన్నారు.

‘పది’ంతల ఆనందం

- ముగిసిన పదో తరగతి పరీక్షలు
- రేపటి నుంచి పీసీఆర్ పాఠశాలలో మూల్యాంకనం
- 2,587 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరు



పాలసముద్రం పరీక్ష కేంద్రంలో చివరి రోజు పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా మార్చి 17 వ తేదీ నుంచి ప్రారంభమైన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈనెల 1వ తేదీతో ముగిశాయి. షెడ్యూల్ ప్రకారం మార్చి 31వ తేదీతోనే పరీక్షలు ముగియాల్సి ఉంది. అయితే మార్చి 31వ తేదీ రంజాన్ పండుగ కావడంతో చివరి రోజు పరీక్షను ఏప్రిల్ 1వ తేదీన నిర్వహించారు. దీంతో మంగళవారంతో జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ముగిశాయి. చివరి రోజు పరీక్ష ముగియడంతో విద్యార్థులు పరీక్ష కేంద్రాల నుంచి బయటకు వచ్చి ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం పరీక్ష కేంద్రాల వద్ద కేరింతలు కొడుతూ సందడి చేశారు. అనంతరం ఆనందంతో ఇంటిబాట పట్టారు. వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులు పరీక్షలు ముగియడంతో సొంత గ్రామాలకు బయలుదేరి వెళ్లారు. మొత్తం ‘పది’ పబ్లిక్ పరీక్షలకు 2,587 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కాగా పరీక్షల్లో మార్చి 28 వ తేదీన వి.కోట బాలురు జెడ్పీ హైస్కూల్ లో ఒక విద్యార్థిని డీబార్ చేశారు.

రేపటి నుంచి పది మూల్యాంకనం

‘పది’ పరీక్షలు పూర్తి కావడంతో ఈనెల 3వ తేదీ నుంచి జవాబుపత్రాల మూల్యాంకనం ప్రారంభం కానుంది. ఇందుకు విద్యాశాఖ అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేపడుతున్నారు. జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో మూల్యాంకన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి చేసినట్లు డీఈఓ వరలక్ష్మి వెల్లడించారు.

గ్రానైట్.. రైట్ రైట్

కుప్పం.. గ్రానైట్ నిక్షేపాల గని .. రెండు రాష్ట్రాల సరిహద్దు నియోజకవర్గం..ఆపై సీఎం ప్రాతినిథ్యం.. అడిగేవారేరీ.. అడ్డుకునే నాథుడేరి.. ఇది కూటమి నేతల ధైర్యం.. ఇంకేముంది..? గ్రానైట్ పర్మిట్లు లేకుండా రాత్రి వేళల్లో యథేచ్ఛగా సరిహద్దులు దాటుతున్న వైనం.. ఫలితం కరుగుతున్న ప్రకృతి సంపద.. ప్రభుత్వ రాబడికి భారీ గండి. దీనికి అడ్డుకట్ట పడేనా? అన్నది శేష ప్రశ్న.

- పర్మిట్లు లేకనే తరలింపు
- ఒక్క పర్మిట్‌తో నాలుగైదు దిమ్మెల తరలింపు
- రాత్రిపూట తరలింపులో ఆంతర్యం ఏమిటి?
- కూటమి హయాంలో పెరిగిన అక్రమ రవాణా



చీగలపల్లి వద్ద సీజ్ చేసిన అక్రమ క్వారీ

కుప్పంరూరల్: సీఎం చంద్రబాబు ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పంలో గ్రానైట్ అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఒక పర్మిట్ మీద నాలుగైదు దిమ్మెలు తరలిస్తూ అక్రమార్కులు విజయం సాధిస్తున్నారు. కనులుగప్పి రాత్రిపూట దొడ్డిదారుల్లో గ్రానైట్ దిమ్మెలను ఎల్లలు దాటిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ అక్రమ రవాణాకు అడ్డూ అదుపులేకపోతోంది. అడ్డుకోవాల్సిన అధికారులు సీఎం నియోజక వర్గం కావడంతో ఎక్కడ కూటమి నేతల నుంచి ఒత్తిళ్లు వస్తాయోనని వెనుకడుగు వేస్తున్నారు. దీంతో గ్రానైట్ అక్రమ రవాణా మూడు పువ్వులు..ఆరు కాయలుగా సాగుతోంది.

ఎల్లలు దాటుతున్న విలువైన గ్రానైట్

కుప్పం నియోజకవర్గంలో ప్రపంచ ప్రఖ్యాతగాంచిన గ్రానైట్ నిక్షేపాలున్నాయి. నియోజకవర్గం లో వంద వరకు క్వారీలు నిర్వహిస్తున్నారు. మరో 20 వరకు అక్రమ గ్రానైట్ క్వారీలు నడుస్తున్నాయి. క్వారీల నుంచి తొలగించి రాతి దిమ్మెలను తమిళనాడులోని తిరుపత్తూరు, జగదేవి, హొసూరు, చెన్నైలోని ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారు. నాణ్యమైనవి విదేశాలకు వెళుతున్నాయి. ఈ క్రమంలో రాతి దిమ్మెలు తరలించేందుకు భూగర్భగనుల శాఖ నుంచి పర్మిట్లు పొందాల్సి ఉంది. పర్మిట్లు ఖర్చుతో కూడుకున్న విషయం కావడంతో అక్రమార్కులు ఒక పర్మిట్ తీసుకుని దానిపై నాలుగైదు రాతి దిమ్మెలు రవాణా చేస్తున్నారన్నది సత్యం. అసలైన పర్మిట్లు ఉన్న లారీలను పగటి పూట జాతీయ రహదారిపై రవాణా చేస్తారు. నకిలీ పర్మిట్లు వేసుకున్న దిమ్మెలను రాత్రిపూట దొడ్డిదారుల్లో రాష్ట్రం హద్దులు దాటిస్తున్నారు. కుప్పం నియోజక వర్గం తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దులో ఉండి, పదుల సంఖ్యలో గమ్యాలు చేరుకునే మార్గాలు ఉండడం అక్రమార్కులకు కలిసి వస్తోంది. దీంతో రాత్రి పూట నిలకడ లేకుండా రోడ్లపై గ్రానైట్ లారీలు పరుగులు తీస్తున్నాయి.

అధికారుల వెనుకడుగు

కుప్పం ముఖ్యమంత్రి నియోజక వర్గం కావడంతో అక్రమార్కులపై చర్యలు తీసుకుంటే ఏ వైపు నుంచి ఏరకమైన ఉపద్రవం వచ్చి పడుతుందోనని అధికారులు వెనుకడుగు వేస్తున్నారు. కారణం అక్రమార్కుల వెనుక కూటమి నేతలు ఉండడమేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఛిద్రమవుతున్న రోడ్లు



లారీ రాకపోకలతో పగిలిన సీసీ రోడ్డు

గ్రానైట్ లారీల రాకపోకలతో గ్రామీణ రోడ్లు ఛిద్రమవుతున్నాయి. వసనాడు, గుడ్లనాయనపల్లి, పరమసముద్రం, పొగురుపల్లి, సంగనపల్లి గ్రామాలకు ఉన్న రోడ్లు గ్రానైట్ లారీలు రాకపోకలు సాగించి, గుంతలుగా మారుతోంది. అంతే కాకుండా రాత్రి పూట వేగంగా శబ్దాలు చేస్తూ భారీ లారీ రాకపోకలు సాగిస్తుండడంతో రాత్రుల్లో నిద్రపట్టడం లేదని గ్రామీణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ రవాణాకు అడ్డుకట్ట ఎప్పుడో?

విలువైన గ్రానైట్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడేదెప్పుడోనని కుప్పం ప్రజలు ప్రభుత్వాన్ని, అధికారులను ప్రశ్నిస్తున్నారు. చంద్రబాబు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు అక్రమ గ్రానైట్ క్వారీలను పరిశీలించి నిరోధించాలని ట్రిబ్యునల్‌కు వెళ్లారు. అలాంటి వ్యక్తే ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్నా.. గ్రానైట్ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఆయనే చొరవ తీసుకుని అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని జనం కోరుతున్నారు. అక్రమ రవాణా వెనుక తమ నేతలే అధికంగా ఉండడంతో చంద్రబాబు అడ్డుకట్ట వేయడం అనేది ప్రశ్నార్థకమే?నని పర్యావరణ ప్రియులు అంటున్నారు.



రాత్రి పూట తరలిపోతున్న గ్రానైట్ లారీ

డైట్ అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కార్వేటినగరం : జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) లో అధ్యాపకులుగా పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శేఖర్ తెలిపారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. డైట్‌లో అధ్యాపకులుగా ఎఫ్‌ఎస్‌టీసీ షరతులతో డెప్యుటేషన్‌పై పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని చెప్పారు. ఆసక్తి కలిగిన ప్రభుత్వ, జిల్లా పరిషత్ , మున్సిపల్, మేనేజ్మెంట్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న స్కూల్ అసిస్టెంట్లు ఆ పాఠశాల హెచ్ఎం, లేదా మండల విద్యాశాఖ అధికారి వద్ద నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే ఉపాధ్యాయులు 31 మార్చి 2025 నాటికి 58 సంవత్సరాలు మించరాదన్నారు. అదే విధంగా దరఖా స్తుదారుడికి కనీసం 5 సంవత్సరాలు పైగా స్కూల్ అసిస్టెంట్, హెచ్ఎం, మండల విద్యాశాఖ అధికారిగా అనుభవం ఉండాలన్నారు. అదే విధంగా సంబంధిత సబ్జెక్ట్ నందు పోస్టు గ్రాడ్యుయేషన్ కలిగి కనీసం 55 శాతం మార్కులు కచ్చితంగా కలిగి ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తుదారుడికి సంబంధిత క్యాడర్ నందు 5 సంవత్సరాలు అనుభవంతో పాటు కనీసం కంప్యూటర్ పరి/జ్ఞానం కలిగి ఉండాలని తెలిపారు. ఈనెల 10 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఈనెల 16 నుంచి 17వ తేదీ వరకు రెండు రోజుల పాటు అర్హత కలిగిన అభ్యర్థులకు రాత పరీక్షలు ఉంటాయని, అర్హత సాధించిన వారికి 19వ తేదీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఇతర వివరాలకు 95057 64611 కృపావతి కళాశాల సూపరింటెండెంట్, 85001 94152 సెక్షన్ అసిస్టెంట్ శ్రీనివాసులును సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

పంటలపై ఏనుగుల దాడులు



ఏనుగులు ధ్వంసం చేసిన వరి పంట

పెద్దపంజాణి : మండలంలో సాగు చేసిన పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉ న్నాయి. కొంత కాలంగా పెద్దకాప్పల్లి పంచా యతీ పరిధిలోని అటవీ సరిహద్దు గ్రామాలైన తిప్పిరెడ్డిపల్లి, కొత్తబూరగపల్లి, పెనుగొలకల, పెద్దకాప్పల్లి, ముదిరెడ్డిపల్లి, బందార్లపల్లి, జి ట్టంవారిపల్లి, గౌరీనగర్, ఆకులవారిపల్లి రైతులకు చెందిన పంటలను నాశనం చేశాయి. సోమవారం రాత్రి పలమనేరు రేంజ్ కీళపట్ల ఫారెస్టు బీట్ నుంచి వచ్చిన ఏనుగులు పెద్దకాప్పల్లి గ్రామంలో వరి పొలాలను ధ్వంసం చేశాయి. మంగళవారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంటలను చూసి తీవ్ర ఆవేదనకు గురయ్యారు. అటవీ శాఖ అధికారులు స్పందించి ఏనుగులను అటవీ ప్రాంతం నుంచి పొలాల్లోకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పాఠశాల విలీనం వద్దే వద్దు..

వెదురుకుప్పం : మా పాఠశాలను ఇక్కడ నుంచి వేరే పాఠశాలలో కలిపితే ఊరుకునేది లేదని మండలంలోని దిగువ గెరిగదొన గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం పాఠశాలలో తల్లిదండ్రులతో అధికారులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రుల అభిప్రాయాలను తీసుకున్నారు. అనంతరం వారు పాఠశాల ఆవరణలో మాట్లాడుతూ.. పాఠశాలలో 20 మందికి పైగా విద్యార్థులు ఉన్నారని అటువంటి పాఠశాలలను రద్దు చేస్తే ఊరుకునేది లేదని చెప్పారు. ఇక్కడ నుంచి సుదూర ప్రాంతాలకు విద్యార్థులు వెళ్లలేరని పేర్కొన్నారు. గ్రామంలోనే పాఠశాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఎట్టి పరిస్థితిలోనూ పాఠశాలను విలీనం చేసే ఆలోచన రానీయవద్దని సూచించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ జీవన , వైస్ చైర్మన్ సుధ, సామాజిక కార్యకర్త మునస్వామి రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

మీకు దిక్కున్న చోట చెప్పుకోండి?

- కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేసిన తహసీల్దారు

గంగాధర నెల్లూరు : పట్టా ఇచ్చేశాం.. మీ దిక్కున్న చోటు చెప్పుకో.. మర్యాదగా బయటకు వెళ్లండి అంటూ రామానాయుడు పల్లి గ్రామస్తులపై జీడి నెల్లూరు తహసీల్దార్ చంద్రశేఖర్ తీవ్ర దుర్భాషలాడారు. గంగాధర నెల్లూరు మండలంలోని రామానాయుడు పల్లిలో కూటమి పార్టీకి చెందిన పొన్నుస్వామి కుటుంబ సభ్యులు గ్రామానికి చెందిన గ్రామ కంఠం భూమిని కూటమి ప్రభుత్వం రాగానే అధికారాన్ని అడ్డం పెట్టుకుని అందులో అక్రమ నిర్మాణం చేపట్టాడు. ఈ విషయంపై నిలదీసిన గ్రామస్తులపై దౌర్జన్యం చేస్తున్నాడని రామానాయుడు పల్లి గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. తమ గ్రామంలోని కొందరిపై కూటమి ప్రభుత్వం అండగా కేసులు పెడుతూ బైండోవర్ పేరుతో పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయానికి తిప్పుతున్నారని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం బైండోవర్ నిమిత్తం గ్రామస్తులను తహసీల్దార్ కార్యాలయానికి రాగా తహసీల్దార్ చంద్రశేఖర్ గ్రామస్తులపై తీవ్ర దుర్భాషలాడడంతో గ్రామస్తులు అవాక్కయ్యారు. మీ అబ్బ సొత్తా.. మీ సొత్తా.. ఆ భూమి పొన్నుస్వామి అనుభవంలో ఉంది.. అతడికి పట్టా ఇచ్చేశాం.. ఏం చేస్తారో చేసుకోండి అంటూ బయటకు వెళ్లండి అంటూ పరుష పదజాలంతో మాట్లాడడంతో గ్రామస్తుల నోట మాట రాలేదు. ఒక మండలాధికారి గ్రామస్తుల బాధను అర్థం చేసుకోపోగా మహిళలు అని చూడకుండా తమను ఇలా అవమానకర రీతిలో మాట్లాడడంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి తమకు నాయ్యం జరిగే వరకు పోరాడుతామన్నారు. గంట తరువాత తహసీల్దార్ కార్యాలయంలోకి రమ్మని అతడికి పట్టా ఇచ్చేశాం.. మీకు కావాలంటే పట్టా రద్దు కోసం ఒక అర్జీ ఇచ్చి వెళ్లండి విచారించి చెబుతామంటూ అక్కడ నుంచి వారిని పంపించేశారు. దీంతో మండిపడ్డ గ్రామస్తులు గత ప్రభుత్వంలో ఎవరికీ పట్టా ఇవ్వలేదు అని అన్న తహసీల్దార్ కార్యాలయం నేడు కూటమి ప్రభుత్వం రాగానే కూటమికి చెందిన పొన్ను స్వామికి పట్టా ఎలా ఇస్తారు అంటూ నిరసన తెలిపారు. కలెక్టరు పలుమార్లు తహసీల్దార్‌కు ఆ వివాద స్థలంలో కట్టడాలు నిలపమని ఆదేశాలిచ్చినా పట్టించుకోకపోవడంపై గ్రామస్తులు తమ ఆవేదన ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాలేదన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న రామానాయుడుపల్లి గ్రామస్తులు



కార్యాలయం నుంచి బయటకి వెళ్లండంటున్న తహసీల్దార్

పుస్తకాల పంపిణీపై డీఈఓ ఆరా!

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు కలెక్టరేట్ : పుస్తకాల డిపో దూరం....పంపిణీ అయోమయం అనే శీర్షికతో ఈ నెల 1వ తేదీన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితం అయింది. ఈ కథనానికి చిత్తూరు డీఈఓ వరలక్ష్మి స్పందించారు. తిరుపతి జిల్లా కేంద్రంలోని పుస్తకాల డిపోను ఎందుకు మార్పు చేయాల్సి వస్తోందని విచారించారు. అనంతరం ఇప్పటి వరకు ఎన్ని తరగతుల పుస్తకాలు డిపో కు అందాయి. వాటి వివరాలను నివేదిక రూపంలో తీసుకురావాలని తిరుపతి పాఠ్య పుస్తకాల డిపో మేనేజర్‌ను ఆదేశించారు. ఉన్నతాధికారులు ఉత్తర్వుల మేరకు చిత్తూరు జిల్లాలో నూతన పుస్తకాల డిపో ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

లక్ష్యానికి మించి క్వారీల పన్ను వసూళ్లు

చిత్తూరు రూరల్(కాణిపాకం): జిల్లాలోని క్వారీల నుంచి ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీలు లక్ష్యానికి మించి వసూళ్లు చేసినట్లు జిల్లా భూగర్భగనుల శాఖ ఏడీ సత్యనారాయణ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 400 క్వారీలుండగా అందులో 220 క్వారీలు వరకు నడుస్తున్నాయన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ క్వారీల ద్వారా రూ.146.9 కోట్లు లక్ష్యం ఉండగా..రూ.175.12 కోట్ల మేర వచ్చినట్లు పేర్కొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 73,007 మంది స్వామివారిని దర్శించుకోగా 27,440 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.04 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

'108' నిర్లక్ష్యం!

- అరగంట నిరీక్షించినా రాని అంబులెన్స్

బైరెడ్డిపల్లి : ప్రభుత్వ ఆసుపత్రికి అర కిలోమీటర్‌లో ప్రమాదం జరిగినా.. అరగంట సేపు వేచి చూసినా 108 వాహనం రాకపోవడంతో గత్యంతరం లేక ఆటోలో వెళ్లాల్సిన దుస్థితి మంగళవారం చోటు చేసుకుంది. బైరెడ్డిపల్లె– కడపనత్తం రహదారిలోని రాయల్ వైన్స్ సమీపంలో మంగళవారం 9 గంటల సమయంలో కడపనత్తం వైపు నుంచి బైరెడ్డిపల్లె వైపు వస్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న గౌనితిమ్మేపల్లె గ్రామానికి చెందిన సుజాతకు తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే సంఘటనా స్థలం చేరుకుని 108 వాహనానికి సమాచారం అందజేశారు. గాయపడిన సుజాత పరిస్థితి తీవ్రంగా ఉండటంతో స్థానికులు ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో 108 వాహనం అందుబాటులో ఉన్నా అరగంట సమయం గడిచినా అర కిలోమీటరు దూరానికి కూడా రాకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరిగిన వెంటనే అందుబాటులో లేని వాహనాలు ఎందుకని ఆవేదన వ్యక్తం చేశారు.



సుజాతను ఆటోలో తరలిస్తున్న స్థానికులు



తీవ్రంగా గాయపడిన సుజాత

నిందితులపై పోక్సో కేసు

పెద్దపంజాణి : బైరెడ్డిపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడిపై, అతడికి సహకరించిన పెద్ద పంజాణి మండలంలోని అమ్మాయి తండ్రిపై మంగళవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు పలమనేరు రూరల్ సీఐ మురళీమోహన్ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు.. పెద్ద పంజాణి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను బైరెడ్డిపల్లి మండలానికి చెందిన యువకుడు నిత్యం ప్రేమిస్తున్నానని వేధించేవాడు. అతడికి అమ్మాయి తండ్రి సహకరించేవాడు. ఈ నేపథ్యంలో బాలిక ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. తదుపరి చర్యల నిమిత్తం పలమనేరు కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండు విధించినట్లు సీఐ చెప్పారు.

చెరువులో జారిపడి వృద్ధుడి మృతి

పాలసముద్రం : చేపలు పట్టేందుకు వెళ్లి చెరువులో జారిపడి గోపాల్‌రెడ్డి (72) మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు ఇలా.. శ్రీకావేరిరాజుపురం పంచాయతీ చెరుముందర కండ్రిగ గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డి (72) ఎస్‌కేఆర్ పురం పాత చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి కాలు జారిపడి నీటిలో పడిపోయి మృతి చెందాడు. ఉదయం వెళ్లిన గోపాల్ రెడ్డి సాయంత్రం 3 గంటలు అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చేపలకు వెళ్లిన వాడు ఇంకా రాలేదని చెరువు వద్దకు వెళ్లి చూస్తే కుంటలో మృతి చెందినట్లు గుర్తించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలో పేకాట ఆడుతున్న ముగ్గురు నిందితులను వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని సీబీ రోడ్డులో కొందరు పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో సీఐ జయరామయ్య తన సిబ్బందితో వెళ్లి దాడులు చేయగా.. పేకాట ఆడుతున్న ముగ్గురు నిందితులను పట్టుకున్నారు. వీళ్ల నుంచి రూ.2 వేల వరకు నగదు స్వాధీనం చేసుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ క్వారీ.. కాసుల సవారీ !

- పెద్దిశెట్టిపల్లిలో కూటమి నేతల అక్రమ తవ్వకాలు
- లభ్యమవుతున్న జీ–20 (బ్లాక్ రాయి)
- జిల్లా, తమిళనాడులో ఈ రాయికి భలే డిమాండ్
- యథేచ్ఛగా అక్రమ రవాణా
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- పట్టించుకోని అధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : చిత్తూరు మండలంలోని పెద్దిశెట్టిపల్లి గ్రామ సమీపంలోని గుట్టలో అక్రమ క్వారీ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. కూటమి నేతలు కూటమిగా చేరి అక్రమ క్వారీని దర్జాగా నడిపిస్తున్నారు. లక్షల్లో దోచుకుంటూ పర్యావరణాన్ని దెబ్బతీస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. పెద్దిశెట్టిపల్లి గ్రామ సమీపంలోని క్వారీ తవ్వకాలు జరుగుతున్న గుట్ట చుట్టూ మామిడి తోటలు పచ్చదనం పరుచుకున్నాయి. ఇక్కడ తవ్వకాలు చేస్తే ఎవరికీ అనుమానం రాదని.. గుట్టు చప్పుడు కాకుండా కూటమి నేతలు క్వారీపై కన్నేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా అధికారుల అండదండలతో తవ్వకాలు మొదలు పెట్టారు. ఈ తవ్వకాలు ప్రస్తుతం మూడు బండలు..ఆరు లక్షలుగా విరాజిల్లుతోంది. ఇక్కడ జీ–20(ప్యూర్ బ్లాక్) రకం లభ్యమవుతున్నాయి. ఈ బండ దిమ్మెలకు జిల్లాతో పాటు తమిళనాడు రాష్ట్రంలో భలే డిమాండ్ ఉంది. ఈ రకం బండలు జిల్లాలో దొరకడం కష్టమని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ బండ క్యూబిక్ మీటర్‌లలో ధర రూ. 50 వేల నుంచి లక్ష వరకు ధర పలుకుతోంది. గుట్ట నుంచి గుడిపాల అటవీ ప్రాంతం మీదుగా తమిళనాడుకు యథేచ్ఛగా తరలిస్తున్నారు. అలాగే గుడిపాల మండలం దాయంవారిపల్లి మీదుగా చిత్తూరు నగర ప్రాంతాల్లోని గ్రానైట్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న ఈ అక్రమ క్వారీపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. కాగా ఇదే మాదిరిగానే సమీపంలో గ్రామంలో మరో క్వారీ కూడా అక్రమంగా నడిపిస్తున్నట్లు సమాచారం.

ఆస్తి రాయించుకొని ఇంటి నుంచి గెంటేశారు!

- డీఎస్పీ ప్రజాదర్బార్‌లో కొడుకుపై తండ్రి ఫిర్యాదు

పుంగనూరు : కన్న కొడుకు , కోడలు తన ఆస్తి రాయించుకుని ఇంటి నుంచి గెంటేశారంటూ ఓ తండ్రి పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్‌కు ప్రజా దర్బార్‌లో ఫిర్యాదు చేసిన సంఘటన మంగళవారం జరిగింది. పలమనేరు డీఎస్పీ ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించేలా నిర్ణయం తీసుకుని, తొలి రోజు కార్యక్రమం చేపట్టారు. ఇందులో మొత్తం 6 ఫిర్యాదులు అందాయి. కాగా మండలంలోని చదళ్ల గ్రామానికి చెందిన కృష్ణప్ప ఫిర్యాదు చేస్తూ తన కొడుకు దేవరాజు, కోడలు కలిసి ఆస్తి రాయించుకొని ఇంటి నుంచి గెంటేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై చర్యలు తీసుకుని ఆస్తిని తన పేరున రాయించి ఇప్పించాలని పేర్కొన్నాడు. దీనిపై విచారణ చేసి, చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు.



పుంగనూరులో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఎస్పీ ప్రభాకర్

పందెంరాయుళ్లు 11 మంది అరెస్టు

బంగారుపాళెం : మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో మంగళవారం కోడిపందాల స్థావరంపై దాడి చేసి 11 మందిని అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. గ్రామ సమీపంలో కోడి పందెం ఆడుతున్నారనే పక్కా సమాచారం అందడంతో సిబ్బందితో కలసి దాడి చేసినట్లు తెలిపారు. కోడి పందెం ఆడుతున్న 11 మందిని అరెస్టు చేశామన్నారు. మరో నలుగురు వ్యక్తులు పారిపోయినట్లు తెలిపారు. కోడిపందెం ఆడుతున్న వారి వద్ద నుంచి రూ 20,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. పందెం రాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి

వి.కోట : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గా యపడి ఉపాధ్యాయు డు మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పాకాల మండలానికి చెందిన గురుమూర్తి (55) రామకుప్పం మండలం కంచిదానసపల్లి పాఠశాలలో ఒప్పంద ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నా రు. గురుమూర్తి రెండు రోజుల సెలవుల అనంతరం మంగళవారం ఉదయం విధులకు హాజరవ్వడానికి తన స్వగ్రామం పాకాల నుంచి బైక్‌పై వసున్నాడు. ఈ క్రమంలో మండలంలోని పలమనేరు–వి.కోట జాతీయ రహదారి రాఘవపల్లి వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డు ప్ర మాదానికి గురై తీవ్రంగా గాయపడగా గ్రామస్తులు గమనించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు గురుమూర్తి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ సోమశేఖర్ రెడ్డి తెలిపారు.



మృతి చెందిన గురుమూర్తి

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

చిత్తూరు అర్బన్ : అనారోగ్యంతో మృతి చెందిన కుబేంద్ర అనే కానిస్టేబుల్ కుటుంబానికి జిల్లా పోలీసుశాఖ రూ.లక్ష ఆర్థిక సాయం అందజేసింది. కార్వేటినగరంలో విధులు నిర్వస్తున్న కుబేంద్ర .. సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఎస్పీ మణికంఠ ఆదేశాలతో అతని కుటుంబానికి జిల్లా పోలీసు సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఉదయ్ తదితరులు, మృతుడు స్వగ్రామానికి వెళ్లి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు.

పాఠశాలల్లో మౌలిక వసతులకు నిధులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర సమగ్రశిక్ష అధికారులు ఉత్తర్వులు విడుదల చేశారు. జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో 18 పనులకు గాను రూ.105.13 లక్షలను మంజూరు చేశారు. మంజూరు చేసిన నిధులతో ప్రహరీలు, బాలురు, బాలికల మరుగుదొడ్లు, విద్యుత్ పనులు, మేజర్ రిపేర్లు చేపట్టాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

చెక్‌పోస్టులోకి దూసుకెళ్లిన లారీ

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలోని ఇరువారం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమార్‌బాబు అనే లారీ డ్రైవర్ గా యపడ్డాడు. బెంగళూరు నుంచి చెన్నైకి ఓ కంటైనర్‌ను తీసుకెళుతున్న లారీ.. ఇరువారం కూ డలి వద్ద అదుపుతప్పి, ఓ స్తంభాన్ని ఢీకొట్టి.. భూగర్భ గనులశాఖ ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు గది లోపలికు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. అయితే లారీ డ్రైవర్ స్వల్పంగా గాయపడటంతో స్థానికులు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



ప్రమాదానికి గురైన లారీ

ఇతర రాష్ట్రాలకు టమాట ఎగుమతి

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లాలో దిగుబడి అయ్యే టమాటను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ పరమేశ్వర్ తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం టమాటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు విక్రయించుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో జిల్లాలోని పలమనేరు నియోజకవర్గం నుంచి నుంచి రెండు రోజులుగా కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు ఇప్పటి వరకు 20 టన్నుల మేరకు టమాట ఎగుమతి చేస్తున్నామన్నారు. మరింత ఎగుమతికి కసరత్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఇంట్లో చోరీ.. కేసు నమోదు

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలోని అనుప్పల్లె గ్రామంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. తాలూక ఎస్ఐ మల్లికార్జున కథనం మేరకు.. అనుప్పల్లెకు చెందిన రఫీ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. రంజాన్ పండుగ నేపథ్యంలో గత నెల 29న భార్య, బిడ్డలతో కలిసి గిరింపేటలోని తన అత్త ఇంటికి వెళ్లారు. మంగళవారం మధ్యాహ్నం అనుప్పల్లెలోని ఇంటికి వచ్చి చూడగా.. ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలో ఉన్న 10 గ్రాముల బంగారు ఆభరణాలు, 400 గ్రాముల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

9,858 మందికి అందని పింఛన్‌లు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఏప్రిల్ నెల పింఛన్‌ల పంపిణీలో 9,858 మంది లబ్ధిదారులకు పింఛన్‌లు ఇవ్వలేకపోయారు. జిల్లా వ్యాప్తంగా 2,64,275 మందికి వివిధ రకాల పింఛన్‌లను అధికారులు పంపిణీ చేయాల్సి ఉంది. అయితే మంగళవారం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్వహించిన పింఛన్‌ల పంపిణీలో 2,54,417 మందికి పంపిణీ చేశారు. మిగిలిన 9,858 మందికి పలు కారణాలతో పింఛన్‌లను పంపిణీ చేయలేకపోయారు. జిల్లా వ్యాప్తంగా 96.27 శాతం పింఛన్‌ల పంపిణీ చేశారు. రూ.112.47 కోట్లకు గాను రూ.108.10 కోట్లను పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ అధికారులు వెల్లడించారు.

భారతీయ సంస్కృతి సంరక్షణే లక్ష్యం



అష్టావధానం చేస్తున్న ఎన్ఎస్‌యూ విద్యార్థి ఉప్పలధడియం భరత్ శర్మ

తిరుపతి సిటీ : భారతీయ సంస్కృతి సంరక్షణే ధ్యేయంగా ఎన్ఎస్‌యూ పనిచేస్తోందని వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. జాతీయ సంస్కృత వర్సిటీ ఉత్కల పరిషత్, తెలుగు విభాగం , వేమ భూపాల కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో కల్చరల్ ఇంటిగ్రేషన్, ప్రమోషన్, సంస్కృతి అధ్యయనంలో భాగంగా మంగళవారం ఉత్కల దివస్ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డిప్యూటీ సిటీ ప్లానర్ సంపూర్ణానంద మహాపాత్రతో కలసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

అనంతరం వారు మాట్లాడుతూ.. వర్సిటీలో ఒడిశా విద్యార్థులు అధికంగా ఉన్నారని, భారతీయ సంస్కృతి ఇంటిగ్రేషన్, పరస్పర అధ్యయనం వంటి విషయాలలో వర్సిటీ కృషి ప్రశంసనీయమన్నారు.

ఆకట్టుకున్న భరత్‌శర్మ అష్టావధానం

ఉత్కల దివస్ మహోత్సవంలో భాగంగా వర్సిటీ యూజీ విద్యార్థి ఉప్పలదడియం భరత్ శర్మ చేసిన అష్టావధాన ప్రక్రియ వీక్షకులను ఆకట్టుకుంది. సంచాలకులుగా దామోదర్‌నాయుడు, పృచ్ఛకులుగా డాక్టర్ సీహెచ్ నాగరాజు, సమస్యాపూర్తికి నందన్‌రావు, వర్ణన పృచ్ఛకులుగా గోలి వేంకట సుబ్రహ్మణ్య శర్మ, న్యస్థాక్షరికి సీతారామశర్మ, ఆశువు విషయానికి ఆచార్యులు నల్లన్న, దత్తపదికి చక్రవర్తి రంగనాథన్, చందోభాషణ అంశానికి శతావధాని ఆముదాల మురళి, అప్రస్తుత ప్రసంగానికి గంగిశెట్టి లక్ష్మీనారాయణ వ్యవహరించారు. డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్, ఉత్కల పరిషత్ అడ్వైజర్ ప్రొఫెసర్ శంకర్‌నారాయణ, రిజిస్ట్రార్ వెంకటనారాయణ, ఒడిశా చైర్ డైరెక్టర్ డాక్టర్ జ్ఞాన రంజనపండా, పరమిత పండా, డాక్టర్ లీనాచంద్ర పాల్గొన్నారు.

ఫోన్ నంబరు తెచ్చిన తంటా!

- భర్త మొబైల్‌లో పక్కంటి మహిళ ఫోన్ నంబరు ఉందని రోడెక్కిన భార్య
- ఆ మహిళతో గొడవకు దిగిన వైనం
- ఆపై పక్కంటి మహిళ ఆత్మహత్య
- తన మృతికి సుజాతనే కారణమంటూ చీటి
- చిత్తూరు మండలం ఏనుగుండ్లపల్లి గ్రామంలో ఘటన

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఇరు కుంటుంబాలు పక్కపక్కనే ఉంటాయి.. తెల్లారితే ఒకరి ముఖాలు.. ఒకరు చూసుకోవాలి. తీరా బంధువులు కూడా.. అయితే ఏమైందో..ఏమో కానీ..ఆ ఇరు కుటుంబీకుల మధ్య కొన్ని నెలల కిందట వివాదం తలెత్తింది. దూరం పెరిగింది. మాటల్లేవ్.. ఈ తరుణంలో భర్త ఫోన్‌లో ఆ పక్కంటి మహిళా ఫోన్ నంబరు ఉందని భార్య గొడవకు దిగింది. దీంతో మనస్తాపానికి గురైన పక్కంటి మహిళా ఇంట్లోనే ఆత్మహత్య చేసుకుంది. పదెంకెల ఫోన్ నంబరు తెచ్చిన తంటాకు ఓ ప్రాణం గాలిలో కలిసిపోయింది. ఈ ఘటన మంగళవారం చిత్తూరు మండలం ఏనుగుండ్లపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు వివరాల మేరకు...చిత్తూరు మండలం ఏనుగుండ్లపల్లి గ్రామానికి చెందిన రమేష్ భార్య ఉమ (30). ఈ దంపతులకు పెళ్లెై ముగ్గురు పిల్లలున్నారు. వీళ్ల ఇంటి పక్కనే శివమణి, సుజాత అనే దంపతులు ఉన్నారు. ఈ ఇరుకుటుంబీకులు దగ్గర బంధువులు. వీళ్ల మధ్య ఏర్పడిన చిన్న తగదాలు గొడవగా మారాయి. కొన్ని నెలలుగా ఈ ఇరు కుటుంబీకుల మధ్య మాటలు లేవు. అయితే సోమవారం శివమణి మొబైల్‌లో ఉమ ఫోన్ నంబరును సుజాత గమనించింది. ఆ నంబరు నీ ఫోన్‌లో ఎందుకు ఉందని సుజాత భర్తతో వాగ్వాదానికి దిగింది. ఇలా ఆక్రోశానికి గురైన సుజాత రోడెక్కింది. ఉమతో గొడవకు దిగింది. ఇద్దరు దుర్భాషలాడుకున్నారు. ఇలా మాట మాట పెరిగి జుట్టు పట్టుకొని కొట్టుకున్నారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైనా ఉమ సోమవారం రాత్రి 10.30 గంటల సమయంలో ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈక్రమంలో జాకెట్‌లోని అట్టముక్కలో తన చావుకు కారణం సుజాతనేని రాసి పెట్టింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. అనుమానం పెనుభూతమైంది. ఓ మహిళా ప్రాణాన్ని బలి తీసుకుంది. క్షణికావేశానికి గురై ఆ మహిళ పరువుకు తలొంచి ఆత్మహత్య చేసుకుంది.